# పక్షులు

సూదిపడితే విన్పించేంత నిశ్శబ్దంగా ఉంది కోర్టుహాలు.

"నేను మా నాన్న దగ్గరే ఉంటాను"

తుళ్లిపడింది పద్మ. కిరణ్ ఆ మాట అన్నాడని పూర్తిగా అర్థం అయ్యేసరికి ఆమె ఒళ్లంతా చెమటతో తడిసి ముద్దయ్యింది. పైన ఫేన్లు తిరుగుతున్నా ఊపిరి అందనట్టైంది. ఒక్క ఉదుటున లేచి కాళ్లీడ్చుకుంటూ బైటికి నడిచింది. వరండాలో బెంచిమీద కూలబడింది.

సిగరెట్టు తాగే నెపంమీద బైటికొచ్చాడు మాధవరావు. అతని ముఖంలో విజయ గర్వం తొణికిసలాడుతోంది. అగ్గిపుల్ల గీసి సిగరెట్టు అంటించుకుంటూ క్రీగంట పద్మ ముఖంలోకి చూసి జరదా కిళ్లీల్తో గారపట్టిన పళ్ళు కన్పించేలా వ్యంగ్యంగా నవ్వాడు.

ఆ నవ్వు చూసి పద్మ మనసు కుతకుతలాడిపోయింది.

అంత నిస్సత్తువలోనూ ఒక్క పరుగున వెళ్లి అతని మీదపడి చెంపలు వాయగొట్టా లన్పించింది.

ఈ దుర్మార్గుడు పదహారేళ్ల క్రితం పెళ్లి పేరుతో తన జీవితంలోకి ప్రవేశించి ఎంతగా వేధించుకుతిన్నాడు.

పెళ్ళైన మర్నాడే తన మెడలోంచి నెక్లెస్ తీసి గూట్లో పెడితే, దాన్ని జేబులో వేసుకుపోయాడు. స్నేహితుడి భార్య మోడల్ చూస్తానంది అన్నాడు. అంతే, మరిక ఆ వస్తువు తన కళ్లపడలేదు. ఆ నెక్లెస్‌ని తను ఎంతో ఇష్టపడి డిజైన్ స్వయంగా గీసి ఇచ్చి చేయించుకుంది. తక్కువ బంగారంలో కొద్దిపాటి రాళ్లతో తండ్రి తనకున్నంతలో చేయించి ఇచ్చిన ఏకైక వస్తువది. ఆ వస్తువు పోయినందుకు కాదు, అతనలాంటి వాడని తెలిసినందుకు కుమిలిపోయింది.

దాని కోసం అడిగినప్పుడల్లా ఏవో కుంటి సాకులు చెప్పేవాడు. చివరికి ఓ రోజు చెంప పగిలేలా కొట్టి

"మళ్లీ ఆ మాటెత్తేవంటే ఒళ్ళు చీరేస్తాను జాగ్రత్త. మగాడికి డబ్బుతో సవాలక్ష పన్లుంటాయి. బంగారం ఎందుకు కొనుక్కోవడం? అవసరమైనప్పుడు డబ్బుగా మార్చుకోడానికే కదా! నీ బాబు దాన్ని కిలోలు కిలోలు పెట్టి చేయించేసేడా? ఇంతా చేస్తే తులం కూడా పూర్తిగా లేదు. అరె, అర్థం చేసుకోదు, వెధవ న్యూసెన్స్" అంటూ ఓ పెద్ద పాఠం చదివాడు.

ఇతడి మాటకేం, ఇతన్దెప్పుడూ ఇదే నైజం. కాని, పదిహేనేళ్ళుగా ప్రాణానికి ప్రాణంగా పెంచుకొచ్చిన కిరణ్ ప్రవర్తనే తనకసలు మింగుడు పడడంలేదు.

పద్మ కంటివెంట నీళ్ళు బొటబొటా రాలాయి.

తను కన్నీళ్ళు పెడుతూన్న విషయం ఈ మాధవరావుకి అసలు తెలీకూడదు. ఏదో నెపంతో వెనక్కి తిరిగి కళ్లు ఒత్తుకుంది. దూరంగా నదిమీద తెరచాప పడవొకటి తేలుతోంది. జనంతో కిక్కిరిసిన లాంచి ఒకటి రేవులోంచి బయలుదేరి లంకలవైపుగా సాగిపోతోంది.

పద్మ కళ్ల ముందు పధ్నాలుగేళ్లనాటి స్మృతి ఒకటి స్పష్టంగా రూపుకట్టుకుంది. అప్పటికి తను బొబ్బర్లంక దగ్గర ఓ పల్లెటూళ్ళో ఎలిమెంటరీ స్కూలు టీచర్‌గా పని చేస్తోంది. పెళ్ళి రెండేళ్ళైనా మాధవరావు ఇంకా ఏ పనిలోనూ కుదురుకోలేదు. కిరణ్ ఏడాది పిల్లాడు.

రాజమండ్రిలో ఉన్న మాధవరావు నాయనమ్మకి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వచ్చింది. అప్పట్లో గోదావరి ఇవతలికి రావాలంటే బొబ్బర్లంక నుంచి లాంచీలో రావాల్సిందే. తనున్న ఊరినుంచి బొబ్బర్లంక వరకూ రాదారి పడవలో రావాలి. స్కూల్లో సెలవుచీటీ ఇచ్చి వచ్చే సరికి రాదారి పడవకాస్తా వెళ్ళిపోయింది. సరుకుల పడవలేమైనా వస్తాయేమోనని కాలవగట్టున చాలా సేపు నిరీక్షించారు. కనుచూపుమేరలో పడవలేమీ కానరాక కాలినడక ప్రారంభించారు.

దారి పొడవునా మాధవరావు సణుగుతూ, సాధిస్తూనే ఉన్నాడు. "ఎదవ మొహాన్ని తీసుకుని ఎక్కడికి బయలుదేరినా అన్నీ ఎదురొస్తాయి" అన్నాడు.

అతని నైజం అలవాటే గనుక పళ్ళబిగువున ఓర్చుకుంటూ వచ్చింది. ఒక చేతిలో పిల్లాడు, మరో చేతిలో బట్టల సంచి. ఎండనపడి నడవలేక శోష వస్తోంది. చేతులూపు కుంటూ, చిన్న చిన్న రాళ్ళు ఏరి కాలవలోకి విసురుతూ రికామికీగా నడుస్తున్న మాధవరావుని చూస్తుంటే పీకలమొయ్యా కోపం ముంచుకొస్తోంది.

అంతలో ఏ దేవుడో కరుణించినట్టుగా కాలవకి అవతలిగట్టున కొబ్బరి కాయల లోడునింపుకొని కట్టు వదలడానికి సిద్ధంగా ఉన్న పడవొకటి కన్పించింది.

"ఆ పడవవాళ్ళని అడుగుదామా" అంది తను.

"ఆ... వాళ్ళు నీకోసం పడవని ఇవతలి గట్టుకుతెస్తారు" అన్నాడు మాధవరావు ఎగతాళిగా.

ప్రయత్నించడంలో తప్పులేదుగా! అందుకే తను గట్టిగా కేకపెట్టి పడవవాళ్ళకి విషయం చెప్పింది. వాళ్ళు పడవని ఇవతలి గట్టుకి నెట్టుకొచ్చి తమని ఎక్కించుకున్నారు.

"మగాణ్ణి నేనుండగా పడవవాళ్ళని నువ్వు పిలిచి మాట్లాడతావా" అంటూ మాధవ రావు సాధింపు మొదలుపెట్టాడు.

బొబ్బర్లంక లాకుల దగ్గర పడవని గోదావరి నీటి లెవెల్‌కి ఎత్తడానికి ఆపినప్పుడు దిగి, వాళ్ళడిగిన డబ్బులిచ్చి కృతజ్ఞతలు చెప్పుకుంది తను.

ఈలోగా పిల్లాణ్ణి ఎత్తుకుని వెళ్ళి అవతలి రేవులో కదలడానికి సిద్ధంగా ఉన్న లాంచి ఎక్కేశాడు మాధవరావు.

ఆపమని చెప్తే లాంచి డ్రైవరు ఆపేవాడే. అతను చెప్పలేదల్లే ఉంది. లాంచి కదిలి వెళ్ళిపోయింది. గోదావరిని చీల్చుకుని నదికి అడ్డంగా కదులుతూన్న లాంచిని తను బిత్తరపోయి చూస్తూ ఉండిపోయింది.

ఆగస్టు నెల! గోదావరి మంచి పరవళ్ళ మీద ఉంది. మాధవరావు కిరణ్‌ని లాంచి టాప్‌మీదికి ఎక్కించి తనూ ఎక్కబోతున్నాడు. వెంటనే కిరణ్ లేచి నిల్చున్నాడు. తన గుండెగొంతులో కొచ్చినట్లైంది. కిరణ్‌కి అప్పుడప్పుడే లేచి ఒకట్రెండు అడుగులెయ్యడం వస్తోంది.

మోకాలిలోతు రేవు బురదలో పడుతూ లేస్తూ వెళ్ళి వరసలో తర్వాత ఉన్న లాంచి ఎక్కేసింది.

లాంచి కదిలింది.

పదిబారల దూరంలోఉన్న ఈ లాంచీలో కూర్చుందన్న మాటేకాని, దృష్టంతా ముందువెళ్తున్న లాంచిమీదే ఉంది. మాధవరావు వెల్లకిలా పడుకుని స్థిమితంగా సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. కిరణ్ లాంచి మీద చకచకా పాకేస్తున్నాడు.

కింద నిండు గోదారి! పైన మబ్బులు కమ్మిన ఆకాశం. అయ్యయ్యో... పిల్లాణ్ణి పట్టు[illegible]ం! వాడికేదైనా అయితే తను బతగ్గలదా? కిరణ్ లేచి నిలబడి దబ్బున పడ్డాడు. పద్మకి తన గుండె ఆగిపోయిందేమో అన్పించింది. కెవ్వున అరిచింది. సీట్లోంచి లేచి నిలబడి చేతులూపుతూ 'కిరణ్ జాగ్రత్త... కిరణ్ జాగ్రత్త' అంటూ కేకలేసింది. అతనేమైనా ఇటువైపు చూస్తుంటేనా!

చల్లని గోదారి గాలిలో కూడా తన ఒళ్లంతా స్వేదంతో తడిసి ముద్దైపోయింది.

టాప్‌కి ఉన్న చిన్న రెయిలింగ్ పట్టుకుని నీళ్లలోకి ఒంగి చూస్తున్నాడు కిరణ్.

పద్మ కళ్లముందు నుంచి పరిసరాలన్నీ మాయమైపోయి పిల్లాడు మాత్రమే నిండిపోయాడు.

వాడు ఆ రెయిలింగ్ మీంచి పట్టుతప్పి నీటిలో పడిపోతేనో... వెంటనే ఈ లాంచిలోంచి తనూ దూకేస్తుంది. తనకి ఈతరాకపోతేనేం... తన బిడ్డతో బాటే తనూ...

మాధవరావు స్థిమితంగా మరో సిగరెట్టు అంటించుకున్నాడు. పిల్లాణ్ణి పట్టించుకోడేం?

లాంచి ఒడ్డుకు చేరేసరికి భరించలేని ఎగ్జైట్‌మెంటుతో స్పృహ తప్పినంత పనయ్యింది తనకి.

తర్వాతెప్పుడో ఆ మాటొస్తే "వాణ్ణి నువ్వొక్కదానివే కన్నట్టు మాట్లాడకు" అన్నాడు.

అలా ప్రాణం కన్నా మిన్నగా చూసుకున్న కొడుకు ఈరోజు ఏమన్నాడు! "నేను మానాన్న దగ్గరే ఉంటాను" అన్నాడు.

పద్మకు దుఃఖం మళ్లీ పెల్లుబికింది. పెంపకంలో తనేనాడూ వాడికి లోటనేది రానివ్వలేదే.

సిగరెట్టుని కాలికిందేసి నలిపి మాధవరావు లోపలికెళ్లాడు. అతను ఎదురుగా లేక పోవడంతో దుఃఖభారం తీరేవరకూ ఏడుస్తూ ఉండిపోయింది. కోర్టు జవానువచ్చి సంతకం చెయ్యాలంటూ లోపలికి పిల్చుకెళ్ళాడు.

జడ్జి ఎదుట సంతకాలయ్యాక పద్మ అదే ఆఖరుసారన్నట్లు కిరణ్‌ని తదేకంగా చూస్తూ ఉండిపోయింది. ఆమె కంటికి వాడు టెన్త్ పరీక్ష రాసిన పదిహేనేళ్ల అబ్బాయిలా కన్పించడంలేదు. భుజం మీదెక్కి ఆటలాడుకుంటున్న పసివాడిలాగే అన్పిస్తున్నాడు.

వాడు మాత్రం మొహం తిప్పుకొని ఎటో చూస్తూ నిల్చున్నాడు.

ఆమె తరపు లాయరు ఆమె మనోవేదనని అర్థం చేసుకున్న వాడిలా అనునయంగా అన్నాడు.

"నెలకోరోజు ఎక్కడున్నా మీ కొడుకును మీరు చూసి మాట్లాడి రావచ్చు".

పద్మ నిర్లిప్తంగా నవ్వింది. గుండెలోపల ఎవరో మంటపెట్టినట్టు ఉంది పద్మకి.

కోర్టులో తతంగాలన్నీ ముగిశాయి.

పద్మ కోర్టు బైటికొచ్చి నిలబడింది. ఏడేళ్ళుగా వాయిదాలకి వచ్చివచ్చి ఇల్లు, స్కూలుతో సమంగా ఈ ఆవరణ కూడా తనకి కొట్టిన పిండైపోయింది. కిరణ్ తనకి దక్కుతాడనే ఆశతోనే ఇన్నాళ్ళూ ధైర్యంగా పోరాడింది.

ఇప్పుడిక వెన్నులోని ఓపికనంతా ఎవరో తీసిపారేసినట్టు నిలబడలేనంత నిస్సత్తువగా అన్పిస్తోంది. తొందరగా బస్సొస్తే బావుణ్ణు.

కిరణ్ భుజం చుట్టూ చెయ్యివేసి నడిపించుకెళ్ళి కార్లో కూర్చున్నాడు మాధవరావు. కారు కదిలి వెళ్ళిపోయింది.

ఏడేళ్ళుగా కొడుకు మీది ఈ ప్రేమంతా ఏమైపోయినట్లు? ఎప్పుడైనా చూడ్డానికొచ్చేడా?

"ఈ మాధవరావు ఎందుకిలా నా జీవితంలోకి ప్రవేశించి బతుకు మొత్తాన్ని నాశనం చేశాడు?" అనుకుంది పద్మ.

బస్సొచ్చింది. బస్సులో కూర్చున్నా పద్మ ఆలోచన్లు ఆమెని వదలడం లేదు.

అతన్ని మొదటిసారి చూసిన ఆ క్షణం ఎంత దురదృష్టకరమైంది! సెకండరీ గ్రేడు ట్రెయినింగ్ పాసై స్కూల్లో టీచర్‌గా జాయినైన కొత్తరోజులవి. జీవితం ఆకుపచ్చగా, ఆనందంగా కన్పించే టీనేజ్‌లో ఉంది తను. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మే అమాయకపు రోజులవి. అందుకే ఎర్రగా బుర్రగా ఉన్న మాధవరావు తనతో పరిచయం పెంచుకుని పెళ్ళివరకూ తీసుకురావడం వెనక అతని ఆంతర్యాన్ని గ్రహించలేకపోయింది. కులాంతరమైనా అతను తనని పెళ్ళాడింది తన సంపాదన చూసే కానీ తనను ప్రేమించి కాదని తెలిసొచ్చే సరికి సమయం మించి పోయింది. పెద్దల్ని లెక్కచెయ్యకుండా తిరిగే అతని నైజం హీరోయిజం కాదనీ, అతని వ్యసనాల కారణంగా అందరూ అతన్ని వదులుకున్నారనీ ఆలస్యంగా తెలుసుకుంది.

తను సంపాదిస్తూంటే ఊరికే కూర్చుని తినేవాడతను. ఇంటి ఖర్చులైనా పూర్తిగా చూడకుండా జీతం మొత్తం ఒక్కరోజులో ఖర్చుపెట్టేసేవాడు. ట్యూషన్స్ చెప్పినా కూడా ఆర్థికంగా ఇబ్బందుల్ని ఎదుర్కోలేక తలమునకలయ్యేది తను. నెల మధ్యలో ఒక్క రూపాయి కావాలన్నా అప్పు చెయ్యాల్సొచ్చేది. కొన్నాళ్ళకి తెలిసొచ్చింది కిరణ్ కోసమైనా జాగ్రత్త పడకపోతే వాడి చదువు, పెంపకం కష్టమైపోతాయని, జీతం అందుకున్న రోజు ఖర్చులు పోను మిగిలింది అటు నుంచి అటే సేవింగ్స్‌లో వేసెయ్యడం మొదలు పెట్టింది. రెండు మూడు నెలలు పెద్దగా అరిచి గొడవలుపెట్టేడు. తను లెక్క చెయ్యక పోవడంతో పశువులా మీదపడి కొట్టాడు. అప్పుడే చెప్పింది తను ఒళ్ళు దగ్గరుంచుకోక పోతే పోలీస్ రిపోర్ట్ ఇస్తానని.

ఆ తర్వాత క్రమంగా ఏదో సాకు చెప్పి వాళ్ళమ్మానాన్నల్ని చూడాలని వెళ్లడం సాగించాడు.

ఉన్నట్టుండి ఓరోజు రిజిస్టర్డ్ పోస్ట్‌లో వచ్చిన కోర్టు నోటీసు చూసి బిత్తరపోయింది తను. తన కేరెక్టర్ మంచిదికాదనీ, తనకి చాలా మందితో అక్రమ సంబంధాలున్నాయనీ అందువలన విడాకులు ఇప్పించమనీ కోర్టుకెళ్లాడు మాధవరావు.

ఆ విషయమై కొన్నాళ్ళూ, కిరణ్‌కి ఎవరు గార్డియన్‌గా ఉండాలనే విషయమై కొన్నాళ్ళూ పిలిచినప్పుడల్లా కోర్టు వాయిదాలకి అటెండవుతూనే వచ్చింది.

ఆరోపించినవేవీ అతను ప్రూవ్ చెయ్యలేక పోయినా ఎంత మానసిక క్షోభను భరించాల్సి వచ్చింది! ఎంత డబ్బు ఖర్చు చెయ్యాల్సి వచ్చింది! అలాంటివాడితో ఇంకా కాపురం ఏంటని డైవోర్స్ పేపర్స్ మీద సంతకం పెట్టేసింది.

ఇదంతా ఎవరికోసం సహించింది? కిరణ్ కోసం కాదూ! పదిహేనేళ్ళు అమ్మ దగ్గర పెరిగిన కిరణ్‌కి ఇప్పుడు అమ్మ అవసరం తీరిపోయింది.

తనకళ్లింకా ఎందుకిలా వర్షిస్తున్నాయి? మాతృత్వంలోని మమకారం వల్లే కదా! ఈ మాతృత్వభావన స్త్రీలని ఎంత నిస్సహాయుల్ని చేస్తోంది!

తననుంచి దూరంగా వెళ్తూనే మాధవరావు అతనికులంలో బాగా డబ్బున్న అమ్మాయిని పెద్దకట్నంతో పెళ్లాడేడని చాన్నాళ్ల వరకూ తనకి తెలీనేలేదు.

అలాంటివాడికి, అందునా ముందు పెళ్లైన వాడికి పిల్లనిచ్చిన అవతలివాళ్ళు అమాయకులో, మూర్ఖులో పద్మకి అర్థంకాదు ఇప్పటికీ. ఇల్లు చేరుకుంటూనే చీరైనా మార్చుకోకుండా మంచం మీద ఒరిగిపోయింది పద్మ.

తనకి ఊహ తెలీనప్పుడే ఈలోకం వదిలి వెళ్ళిపోయిన తల్లినీ, తన పెళ్లైన కొద్ది కాలానికే కాలం చేసిన తండ్రినీ తల్చుకుని తనకంటూ తోడులేని ఒంటరితనానికి దుఃఖపడుతూండగానే నిద్రాదేవి ఆమెని కరుణించింది.

ఎప్పటి అలవాటు చొప్పున వేకువనే మెలకువొచ్చింది పద్మకి. అలవాటు ప్రకారం కిరణ్‌కి బాక్స్ పెట్టడానికి వంట చెయ్యాలని ఆత్రంగా లేవబోయింది. విషయం స్ఫురించి మళ్లీ బద్ధకంగా మంచంమీద వాలిపోయింది.

నిద్రలో మనసు కొంత తేలికపడింది.

కిటికీలోంచి బైటికి చూసింది. చీకటిని విచ్ఛిన్నం చేస్తూ వెలుతురు కిరణాలు లోకాన్ని కమ్ముకుంటున్నాయి. పెరట్లోని చింతచెట్టుమీద రెక్కల టపటపలు వినిపించి కిటికీ ఊచలకి మొహం ఆనించి అటుచూసింది.

ఎండుపుల్లల్తో అస్తవ్యస్తంగా కట్టిన గూట్లోంచి రెక్కలొచ్చిన పిల్లల్ని బైటికి తరిమేసే ప్రయత్నంలో ఉంది తల్లి కొంగ. ముక్కుతో పొడిచి పొడిచి బైటికి తోస్తోంది. ముందు గూడు వదలనని మొండికేసినా భయంభయంగానే ఎగిరి పక్క కొమ్మమీద కూర్చుంది కొంగపిల్ల. అలా ఎగిరే ప్రయత్నంలో మరోపిల్ల టప్పున నేలమీద పడిపోయింది. తల్లికొంగ అదేం పట్టించుక్కోకుండా తనదారిన తను ఎగిరిపోయింది.

నేలమీది పిల్ల లేచి రెక్కలు విప్పార్చుకుని చెట్టుమీదికి ఎగిరే ప్రయత్నం చేస్తోంది.

పద్మ అలా చూస్తూ ఉండిపోయింది.

క్రమంగా ఆమె మనసులోని దిగులును ఎవరో చేత్తో తీసేసినట్లైంది.

రెక్కలొచ్చాక పశుపక్ష్యాదులైనా, మనుషులైనా ఎవరిదారి వాళ్ళదే కదా!

పది రోజుల తర్వాత స్కూల్లో పిల్లల్తో బిజీగా ఉన్న పద్మకి పోస్ట్‌మేన్ ఓ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు.

ఆత్రంగా ఉత్తరం విప్పింది.

అమ్మా,

నేనిక్కడ క్షేమం. నువ్వూ బావున్నావని తలుస్తున్నాను.

నేనిలా నిన్ను వదిలి వచ్చేశానని నీకు కోపం వచ్చి ఉంటుంది. నాకు తెలుసు. కానీ, నా భవిష్యత్తు గురించి ఆలోచించుకుని ఇలా చెయ్యక తప్పలేదు.

ఇక్కడ పిన్నికి పిల్లలు లేరు. నేను తనతో వచ్చేస్తే ఈ ఆస్తంతా నాకే వస్తుందన్నాడు నాన్న. ఇక నా చదువంటావా నా ఇష్టం. కావాలంటే ఎంతైనా చదువుకోవచ్చు. వద్దనుకుంటే మానెయ్యొచ్చు. ఇన్నాళ్ళుగా కోర్టులకీ, లాయర్లకీ ఖర్చు పెట్టడం వలన నువ్వెంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నావో నాకు తెలుసు. ఇకపైన నాచదువూ, నేనూ నీకు భారం కాకూడదని నేనీ నిర్ణయం తీసుకున్నాను.

ఉంటాను మరి!

నీ కిరణ్

మరోసారి చదివి, ఉత్తరంలో లేని ఆర్ద్రత  కోసం వెతుక్కుంది పద్మ ఒక్షణం. మరుక్షణమే ఉత్తరాన్ని మడిచి పర్స్‌లో పెట్టేసింది.

'రెక్కలు రాకుండానే మరో మంచి గూడు వెతుక్కున్నాడు కిరణ్' అనుకుంది.

ఆమె పెదవుల మీద నిర్లిప్తమైన నవ్వొక్కటి విచ్చుకుంది.

*విపుల, డిసెంబరు 1998*